ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 292 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 29 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



# వన్ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

### తెలంగాణకు భారీగా పెట్టుబడులు రాక
### దావోస్ ఒప్పందాలతో
### రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు
### స్కిల్ వర్సిటీ కోసం సింగపూర్‌తో ఒప్పందం
### పెట్టుబడులపై కొందరు వక్రభాష్యాలు
### రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారాలు చేస్తున్నారు
### మంత్రులతో కలిసి మీడియా
### సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 28 (ప్రభాత ఉదయం):** తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ. 1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అయితే కొందరు దీనిని జీర్ణించుకోలేక వెకిలి వ్యాఖ్యలు చేస్తున్నారని సిఎం మండిపడ్డారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం ర ఏవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉ ంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని సీఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది మా ప్రభుత్వం సాధించిన కీలక విజయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. దావోస్ పర్యటనతో రూ. 1.80 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టేలా మన రాష్ట్రం ఆకర్షించగలిగిందని చెప్పుకొచ్చారు. ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు.

రాజకీయంగా విభేదించినా రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయ వివాదాలకు వెళ్లొద్దని హితవు పలికారు. పెట్టుబడులకు అవసరమైన భూ కేటాయింపులు చేసి అన్ని రకాలుగా ఆ సంస్థలను ప్రోత్సహిస్తామన్నారు. మనందరం కలిసి కష్టపడితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. సింగపూర్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐటీఈ సంస్థతో కూడా ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. ఇది భవిష్యత్‌లో మన సాంకేతికను పెంపొందించ డానికి ఉ పయోగపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకుని రావాలనేది మా ప్రయత్నం అని అన్నారు వాళ్లు ఇక్కడి నుంచి విదేశాలకు నిధులు తరలించారు. ఇక్కడ కొల్లగొట్టిన సొమ్మునే విదేశీ పెట్టుబడులుగా చూపారు. మేం విఫలమైతే పైశాచిక ఆనందం పొందాలని కొందరు చూశారు. ఇతర రాష్ట్రాలకంటే గొప్పగా పెట్టుబడులు సాధించాం. అసూయతోనే మమ్మల్ని వారు అభినందించడం లేదు. భారీ పెట్టుబడులు తేవడం చూసి కొందరికి కడుపుమంటగా ఉందని పరోక్షంగా బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి అన్నారు. ప్రతిపక్షంలో ఓ నేత అటెన్షన్ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. చాలా సంస్థలు మన పెవిలియన్‌కు వచ్చి ఒప్పందాలు చేసుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఈస్థాయిలో పెట్టుబడులు రాలేదనే అక్కసుతో ఉన్నారు. ఎనర్జీ పాలసీతోనే తెలంగాణలో పెట్టుబడులు పెరిగాయి. అంతర్జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు దావోస్ వెళ్లాం. ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీగా పెట్టుబడులపై

..మిగతా 2లో

# ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

### టెంపుల్ టూరిజం పట్ల నిర్లక్ష్యం వహించారు
### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలే ప్రోత్సహిస్తాం
### ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును
### ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
### ఇది సినిమా షూటింగ్‌లకు అద్భుతమని చెప్పిన
### నటుడు చిరంజీవి



**హైదరాబాద్, జనవరి 28 (ప్రభాత ఉదయం):** ప్రకృతి రమణీయతకు మారు పేరుగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న సంకల్పం తో ఉన్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏటా కోటి మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ఉ న్నామని అన్నారు. తెలంగాణను ప్రకృతివనంగా మార్చాల్సి ఉంది. తల్లి పేరిట విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించే విధానం తీసుకొ స్తాం. త్వరలో విధివిధానాలు ఖరారుచేస్తాంఅని సీఎం అన్నారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో 150 ఎకరాల్లో ఈ పార్కును తీర్చిదిద్దారు. దీనిలో 25వేల జాతుల మొక్కలు ఉన్నాయి. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన వృక్షాలు, చెట్లు ఉన్నాయి. ఎక్స్ పీరియం పార్కులో రూ.లక్ష నుంచి రూ.3.5కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలు వృక్షాలను సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కొనుగోలు చేశారు. రాందేవ్‌రావ్ ఆరున్నరేళ్ల పాటు శ్రమించి ఎక్స్ పీరియంను తీర్చిదిద్దారు. దీనిలో వివిధ ఆకృతుల్లో రాక్ గార్డెన్‌ను సిద్ధం చేశారు. 1500 మంది కూర్చునేలా యాంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.150 కోట్ల విలువైన మొక్కలు,

..మిగతా 2లో

# థియేటర్లకు హైకోర్టు షాక్

### 16 ఏళ్ల లోపు పిల్లలకు టైమింగ్స్
### ఉదయం 11 తరవాత..
### రాత్రి 11 లోపు మాత్రమే అనుమతి



**హైదరాబాద్, జనవరి 28 (ప్రభాత ఉదయం):** పుష్ప 2' సినిమా ప్రీమియర్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన అనంతరం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుని ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంచుకోవడాలు వంటి వెసులుబాటు ఉండదని స్పష్టంగా ప్రకటించింది. సంక్రాంతికి వచ్చిన 'గేమ్ చేంజర్' సినిమాకు టికెట్ల ధరను పెంచుకునే వెసులుబాటు కల్పించినా.. కోర్టు కలగజేసుకోవడంతో.. వెంటనే టికెట్ల ధరలను తగ్గించారు. దీంతో చిన్న సినిమాలకు ఏమోగానీ.. భారీ బ్జడెట్‌తో రూపొందే సినిమాలకు మాత్రం అంతే భారీగా ఇబ్బంది నెలకొంది. ఇదిలా ఉంటే.. తాజాగా హైకోర్టు.. ఫ్యామిలీ ఆడియన్స్‌కు,

..మిగతా 2లో

# ప్రారంభమైన నాగోబా జాతర

### ఫిబ్రవరి 4 వరకు వేడుకలు
### 600 మంది పోలీసులు,
### 100 సీసీ కెమెరాల ఏర్పాటు



**హైదరాబాద్, జనవరి 28 (ప్రభాత ఉదయం):** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్రపరిచారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు చేస్తారు. అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం

..మిగతా 2లో

# నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ



### జిల్లాలో వరి ఉత్పత్తిని పెంచేలా చేసిన కేసీఆర్
రైతుబంధు ఉంటే కేసీఆర్‌ను
గుర్తుంచుకుంటారన్న కుళ్లు
రైతుభరోసా పేరుతో
కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోంది
ఇచ్చిన హామీలపై ప్రజలు
కాంగ్రెస్‌ను నిలదీయాలి
నల్లగొండలో ఇదో విజయోత్సవ సభలా ఉంది
నల్లగొండ రైతు ధర్నాలో కేటీఆర్ విమర్శలు

2

# అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

### ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు



**సంగారెడ్డి జనవరి 28 (ప్రభాత ఉదయం):** హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకుపుట్టేలా చేస్తోంది హైడ్రా. తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహారీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన

..మిగతా 2లో



నూతన సంవత్సరం 25 క్యాలెండర్ ను విడుదల చేస్తున్న మైనారిటీ ఉద్యోగులు

# మైనార్టీ ఉద్యోగుల అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి28(ప్రభాత ఉదయం)తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జోగులాంబ గద్వాల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్, నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ బషీర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ బషీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు ఎండి. ఖాజా పాషా, కోశాధికారి ఎండి హనీఫ్, జాయింట్ సెక్రటరీ షేక్ ఫర్దీన్, ఎండి మస్తాన్ వలి, ఎండి. దర్వేష్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన నాగోబా జాతర

మొదటి పేజీ తరువాయి...

జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.నాగోబా జాతర సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక నాగోబా జాతర అని, గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు అంటూ పేర్కొన్నారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబురం తెలంగాణ సాంస్కృతిక వైభవమని పేర్కొన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ వేడుకలో ఆధ్యాత్మిక వెలుగులు నింపే ఆదిశేషువు కరుణాకటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక "నాగోబా జాతర" సందర్భంగా ముఖ్యమంత్రి గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబురం ప్రారంభంకానుంది. గోండుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన నాగోబా జాతరను ఆదివాసీ, గిరిజనులు ఘనంగా జరుపుకుంటారు. ఈ జాతరకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలను పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దీంతో ప్రభుత్వం సుమారు 600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది.ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య సందర్భంగా గిరిజనుల ఇలవేల్పు నాగోబా మహాపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం మెస్రం వంశీయులు నెల రోజుల ముందు నుండే ఏర్పాట్లు చేపడతారు. కాలినడకన సుమారు 250 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తీసుకువచ్చిన పవిత్ర గోదావరి జలాలలో నాగోబాకు అభిషేకం, మహాపూజ చేయడంతో ఈ ఇక్కడ జాతర మహోత్సవం ప్రారంభమవుతుంది. ఇప్పటికే నాగోబా అభిషేకానికి కావాల్సిన పవిత్ర గంగా జలాలను తీసుకొని కేస్లాపూర్ కు వచ్చిన మెస్రం వంశీయులు ఆలయ సమీపంలోని మర్రి చెట్టు వద్ద విడిది చేసి ఉన్నారు. మంగళవారం రాత్రి అక్కడి నుండి గిరిజన సంప్రదాయ దుస్తుల్లో వాయిద్యాలతో ఆలయానికి చేరుకుంటారు. అనంతరం మెస్రం వంశీయులు, కట్టోడాలు ఆలయాన్ని శుద్ధి చేస్తారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో తయారు చేయించిన కుండలను మాత్రమే గిరిజనులు ఇక్కడ పూజలకు వినియోగించడం ఆనవాయితీగా వస్తుంది.

# అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

మొదటి పేజీ తరువాయి...

హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చివేతల తరువాత కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్‌కు కబ్జా దారులు వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లను హైడ్రా కూల్చివేసింది. ఇళ్ల నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా... అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని.. చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

మొదటి పేజీ తరువాయి...

చెట్లు, వృక్షాలు కలిగిన ఏకైక పర్యాటక ప్రాంతంగా ఇది నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. 'అటవీ ప్రాంతాల సందర్శనకు మధ్యప్రదేశ్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మందిరాల దర్శనాల కోసం తమిళనాడు, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదన్నారు. ఎకో టూరిజంపై ఇటీవలే అసెంబ్లీలో చర్చించాం. పర్యాటక పాలసీ తీసుకువచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం అన్నారు. ఎకో టూరిజం కింద త్వరలో వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో మరిన్ని పర్యాటక క్షేత్రాలు రావాల్సి ఉంది. వరితో పాటు వాణిజ్య పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.. అనంతరం నటుడు చిరంజీవి మాట్లాడుతూ రాందేవ్‌ను కొనియాడారు. 'పొద్దుటూరు ప్రదేశం నాకు ముందే తెలుసు. నేను ఇల్లు కట్టుకున్నప్పుడే రాందేవ్ నాకు కొన్ని విదేశీ మొక్కలు ఇచ్చారు. మా ఇంటి వద్ద పెరిగిన మొక్కలను చూస్తే చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. మన హైదరాబాద్‌లోనే ఇలాంటి మొక్కలను రాందేవ్ తీసుకురావడం అభినందనీయం. ఆయన వ్యాపారవేత్తగా కాకుండా కళాకారుడిగా కనిపించారు' అని చిరంజీవి అన్నారు. ఎక్స్‌పీరియం పార్కు హైదరాబాద్‌కు తలమానికం అవుతుందని, ఒక కళాఖండంగా మిగిలిపోతుందని చిరంజీవి అన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు ఇలాంటి మొక్కలు, కళాకృతులు చూస్తుంటాం. ఇండియాకు తీసుకెళ్తే బాగుండని అనిపించేది. ఇక్కడ హైదరాబాద్ శివారులో అవి లభిస్తున్నాయంటే, చాలా ఆనందంగా ఉంది. మా ఇంటి దగ్గర నేను రోజూ కూర్చొనే ప్రదేశంలో బయటకు కనపడకుండా ఫెన్సింగ్‌లా డిజైన్ చేయమంటే, రాందేవ్ అద్భుతంగా చేసి ఇచ్చారు. నా ఇంటి చుట్టూ చాలా చక్కని చెట్లు పెట్టుకున్నా. రాందేవ్ 'కొత్తగా మొక్కలు వచ్చాయి చూస్తారా' అని అడుగుతూ ఉంటారు. ఒకప్పుడు వాటి ధరలు వేలు, లక్షల్లో ఉండేవి. ఇప్పుడు కోట్లలో ఉంటున్నాయి. అసలే నా సంపాదన అంతంత మాత్రంగా ఉంది. కొనలేనేమో అనిపించింది. గౌరవ ముఖ్యమంత్రితో ఇక్కడకు వచ్చి, చూస్తే ఇవన్నీ కొనేయాలనిపిస్తోంది' 'ఇలాంటి వాటిని పెట్టాలంటే వ్యాపార దృక్పథం ఉంటే సరిపోదు. అందుకే రాందేవ్‌లో ఒక ఆర్టిస్ట్‌ను చూస్తా. మొక్కలపై అంత ఇష్టం లేకపోతే దాదాపు పాతికేళ్లు ప్రయోగాలు చేస్తూ, విదేశాల్లో ఉన్న అరుదైన మొక్కలను సైతం ఇక్కడకు తీసుకొచ్చి, ఇది సాధ్యమే అని నిరూపించారు. ఎక్స్‌పీరియంలోని శిలాకృతులు మన హైదరాబాద్‌కు అందం తీసుకొస్తాయి. డబ్బులు, స్థలం ఉంటే ఎవరైనా రియల్ ఎస్టేట్ చేద్దామని అనుకుంటారు. ప్రభుత్వ అనుమతి తీసుకుని, పెద్ద మల్టీస్టోర్ బిల్డింగ్ కడితే, తరాలు నిలిచిపోతుంది. కానీ, రాందేవ్ తన మదిలో ఉన్న దాన్ని వాస్తవంలోకి తీసుకొచ్చారంటే నిజంగా హ్యాట్సాప్. 'ఇది షూటింగ్స్‌కు ఇస్తారా రాందేవ్' అని అడిగితే, 'ఫస్ట్ మీ మూవీ షూట్ అయితే ఇస్తా' అన్నారు.

## ఫిబ్రవరి 1 నుండి ప్రారంభంకానున్న పెద్ద చింతరేవుల

# ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

### ఫిబ్రవరి 3న స్వామి వారి రథోత్సవం

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి28(ప్రభాత ఉదయం) భక్తుల కోరికలు, చింతలు తీర్చే కొంగు బంగారమైన ధరూర్ మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 1నుంచి 7 వరకు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు తెలంగాణ వాసులేకాక ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ ధర్మకర్త సి.గిరిరావు, ఆలయ ఈఓ కవిత, ప్రధాన అర్చకులు కిష్టాచార్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యే భక్తులు స్వామి వారికి తలనీలాలు, దాసంగ నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకుంటారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వసతి సౌకర్యం, క్యూలైన్ల ద్వారా దర్శన సౌకర్యం వంటి ఏర్పాట్లను అధికారులు చేపట్టారు.

**బ్రహ్మోత్సవాల వివరాలు**

స్వస్తిశ్రీ శాలివాహన శక 1945 శోభకృత్ నామ సం.ర మాఘ శుద్ధ తదియలు మొదలు శుద్ధ దశమి వరకు శ్రీ అంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవములు ఫిబ్రవరి నెల 1నుండి ఫిబ్రవరి 7 వరకు కొనసాగుతాయని దేవాలయ వ్యవస్థాపక వంశీయులు గిరి రావు, ఈఓ వెంకటేశ్వరమ్మ తెలిపారు. ఫిబ్రవరి 1 శనివారం రోజు స్వామి వారి అంకురార్పణ ధ్వజారోహణం, 2న ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకి సేవ, ప్రభోత్సవం, 3న రాత్రి 10 గంటలకు రథోత్సవం, 4న ప్రభోత్సవం, 5న అవభృత స్నానం, 6న మధ్వనవమి, ఫిబ్రవరి7న స్వామి వారి పల్లకి సేవ స్వస్తి వాచకం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

**స్వామి వారి చరిత్ర...**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం పెద్దచింతరేవుల గ్రామములో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి శ్రీ వ్యాసరాయల వారిచే ప్రతిష్టంపబడి శ్రీ శేషదాసుల





వారిచే బాహ్య ప్రపంచానికి ఈ స్వామి దర్శన భాగ్యము కలిగినది. శ్రీ శేషదాసుల వారి అసలు పేరు శేషగిరిరావు వీరు పెద్ద చింతరేవుల గ్రామము నుండి 10 కీ.మీ. దూరములో గల ధరూరు గ్రామము పట్వారిగా పనిచేయుచుండిరి. ఇట్టి మహ వ్యక్తికి గద్వాల సంస్థానము మహరాజు సోమ భూపాల్ గారి నుండి ఏదోక సందర్భములో అవమానము జరిగి పట్వారి పనిని త్యజించి సంసార జీవనముపై విరక్తి చెంది గద్వాల నుండి అడవి ప్రదేశము అయిన ఇప్పటి పెద్ద చింతరేవుల గ్రామమునకు మరణించవలెనని వచ్చి అక్కడ పెద్దపాముల పుట్టయందు చేయు పెట్టి దుఃఖిస్తూ నిద్రపోయేను. గాడ నిద్ర సమయములో శ్రీ ఆంజనేయస్వామి కలలో కనిపించి నేను ఈ పుట్టలో వున్నాను. పుట్టను తవ్వి తీసి నా సేవ చేయమని ఆజ్ఞాపించనైనది. మరుసటి రోజు పాముల పుట్టను తవ్వగా లోపల వున్న శ్రీ ఆంజనేయస్వామి దర్శన భాగ్యము లభించినది. ఆ రోజు నుండి స్వామి వారికి రెండు రోజులు ఉపవాసముతో సేవ చేసినాడు. రెండవరోజు రాత్రి శ్రీ ఆంజనేయస్వామి వారు పెద్ద చింతరేవుల గ్రామము నుండి 3 కీ.మీ. దూరంలో గల రేవులపల్లి గ్రామ పట్వారి అయిన తిమ్మయ్యకు కలలో కనిపించి శ్రీ శేషదాసుల వారి సేవ చేసి వారి తపస్సుకు సహకరించవలసిందిగా ఆజ్ఞాపించనైనది. స్వామి వారి ఆజ్ఞానుసారము మరుసటి రోజు పెద్ద చింతరేవుల గ్రామమునకు వచ్చి స్వామి వారికి నైవేద్యము సమర్పించి శేషదాసుల వారికి తినిపించి తాను తినుచుండేను. కొన్ని రోజుల తరువాత పట్వారి తిమ్మయ్య గారు ప్రజల సహకారముతో స్వామి వారికి చిన్న గర్భగుడి నిర్మించినారు. ఈ విధంగా శ్రీ వ్యాసరాయల వారిచే ప్రతిష్టంపబడిన శ్రీ స్వామి వారు శ్రీ శేషదాసుల ద్వారా ప్రజలకు దర్శన భాగ్యము కల్పించినారు ఈ స్వామి ఉగ్రమూర్తి అయిందున ఇక్కడ ప్రజలు స్వామి వారి పరిసర ప్రాంతములో సంచరించుటకు భయపడినారు. శ్రీ శేషదాసుల వారు తన తపస్సు శక్తిచే యంత్రప్రతిష్ఠ చేసి స్వామి వారిని ఉగ్రమూర్తి నుండి శాంత స్వభావమూర్తిగా మార్చినాడు. శ్రీ శేషదాసుల వారు ఇక్కడ 20 సం[illegible]లు కఠోర తపస్సు చేసి పండరిపురం పాండురంగస్వామి దర్శనము చేసుకోన్నారు. శేషదాసుల వారి కాల వ్యవధి (1802 నుండి 1885 వరకు). ఇట్టి ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి మొక్కులు సమర్పించుకుంటారు. ఫిబ్రవరి 1నుండి ప్రారంభకానున్న బ్రహ్మోత్సావాలకు ముఖ్య అతిథులుగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరుకానున్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త, ఆలయ ఈఓ, ఆలయ ప్రధాన అర్చకులు పిలుపునిచ్చారు.

# నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ

**నల్గొండ, జనవరి 28 (ప్రభాత ఉదయం):** ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన.. వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. ఇక్కడికి గోదావరి జలాలను తరలించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో భారాస రైతు మహా ధర్నాలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ..' రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు.రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డి లో ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్ని పంటలకు క్వింటల్‌కు రూ.500 బోనస్ ఇస్తమన్నడు. మరె ఎవరికన్నా బోనస్ పైసలు పడ్డయా..? ఇప్పుడు మాట మార్చి సన్నవడ్లు పండిస్తెనే బోనస్ ఇస్తం అంటున్నరు. ఇగ వ్యవసాయ మంత్రి అయితే సన్నవడ్లకు బోనస్ ఇచ్చుడు బాగుంది, రైతు భరోసా అక్కెరే లేదని రైతులే చెప్తున్నరు అంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నయ్ కాబట్టి రైతుభరోసా ఇస్తం అని నాటకమాడుతున్నరు. ఈ నాటకాలను మీరు గమనించాలె. ఎన్నికలు అయిపోంగనే రైతు భరోసా కూడా బందైతది' అని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పుడు ఆరోగ్య శ్రీ అంటే వైఎస్ఆర్ యాదికొస్తరు. రైతుబంధు అంటే కేసీఆర్ గుర్తుకొస్తరు. అందుకే రైతుబంధు ఇస్తే కేసీఆర్‌కే పేరు వస్తదని, ఆయనను ఎవరూ దేకరని రేవంత్‌రెడ్డి భయపడుతున్నడు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని మీరు ఇక్కడ గమనించాలె అని అన్నారు. రైతుభరోసా పేరుతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం.. ఇప్పుడు రైతులకు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ ఉన్నడు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లా ఓట్లు అడగడానికి వస్తరు. అప్పుడు ఈ బాకీ డబ్బులు అడుగుండ్రి. రుణమాఫీ ఏమైందని అడుగుండ్రి. ఏమైంది బోనస్ అని అడుగుండ్రి. ఆరుగ్యారంటీలు ఏమైనయని నిలదీయుండని కేటీఆర్ నల్లగొండ రైతులను కోరారు. రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పెద్దపెద్ద మాటలు చెప్పిండని, అధికారంలోకి వచ్చినంక ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు అట్టర్‌ప్లాప్ అయ్యిందన్నారు. అసెంబ్లీలో ఇదే విషయమై నిలదీస్తే రేవంత్ రెడ్డి నోరు మెదపలేదన్నారు. ఇప్పటికీ రుణమాఫీకి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.12 వేల కోట్లు కూడా దాటలేదన్నారు. 'ఇప్పుడు గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు. ఏమాయె రుణమాఫీ అంటే సమాధానం లేదు. ఏమాయె ఆరు గ్యారంటీలు అంటే సమాధానం లేదు. కేసీఆర్ బిచ్చమేసినట్టు రూ.10 వేలే ఇస్తున్నడూ.. నేను రూ.15 వేలు ఇస్తా అని రేవంత్ రెడ్డి చెప్పిండు. మరె ఇస్తున్నడా రూ.15 వేలు..? ఆఖరికి రూ.12 వేలు ఇయ్యాలని నిర్ణయం జేసిండ్రు. పైగా అది చారిత్రాత్మక నిర్ణయం అని అంటున్నడు. మోసం చేసుడు గూడా చారిత్రాత్మకమేనా అంటూ కెటిఆర్ ఎద్దేవా చేశారు. జనవరి 26 రాత్రి నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడుతాయని చెప్పాడని, కానీ ఇంతవరకు రైతు భరోసా డబ్బులు రాలేదని ఆయన ఆరోపించారు.

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

### ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### చేనేత సారె, పట్టు వస్త్రాల తయారీ నీ ప్రారంభించిన ఎమ్మెల్యే





గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి28(ప్రభాత ఉదయం) గద్వాలలోని శ్రీ భూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహించు బ్రహ్మోత్సవాలు, శ్రీ జమ్ములమ్మ పరశురాముడు దేవస్థానం నందు నిర్వహించు బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. త్వరలో ప్రారంభంకానున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శ్రీభూలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో చేనేత కార్మికుల ఆధ్వర్యంలో రూపొందిస్తున్న చేనేత సారే, పట్టు వస్త్రాల తయారీ సందర్భంగా మగ్గానికి గద్వాల ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మగ్గం పనులను ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యే శ్రీభూలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 12న ప్రారంభంకానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేకంగా వస్త్రాలను ఇక్కడి నుండే తయారు చేయించాలనే ఉద్దేశంతో గద్వాల చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం మాస్టర్ వీవర్స్ ఆధ్వర్యంలో గద్వాల చేనేత కార్మికులతో స్వామివారి అమ్మవార్లకు అలంకరణ వస్త్రాలను తయారు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ప్రతి ఏడాది ఆనవాయితీగా ఇలాగే ఈ ఏడాది గద్వాల చేనేత కార్మికుల ఆధ్వర్యంలో గద్వాల చేనేత కార్మికుల సాంప్రదాయం ప్రకారం అమ్మవారి సారే, స్వామి వారి పట్టు వస్త్రాలను తయారుచేసి అమ్మవారికి, స్వామి వారికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. భూ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి, జములమ్మ అమ్మవారి ఆశీస్సులతో గద్వాల నియోజకవర్గం ప్రజలు, రైతులు దినాదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్లు మురళి, దౌలు, నాయకులు డి.ఆర్ విజయ్, గోవిందు, కురుమన్న,ధర్మ నాయుడు, పూడూరు చిన్నయ్య, గద్వాల చేనేత ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు అక్కల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మంత్రి సురేష్, చిలువరి సాయిబాబా, సురేష్, చేనేత కార్మికులు అక్కల శాంతారాం , శాఖ రాము, కోట చిన్న నరసింహులు ,వడ్డే వెంకటేష్, బావండ్ల శ్రీహరి, వాసు నీలమ్మ, కొంకతి రేణుక, మహిళా చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# వన్ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

ఒప్పందాలు చేసుకున్నాం. తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇదో అద్భుత పరిణామం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో గతేడాది కంటే నాలుగు రెట్లు ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రజలు, యువతకు మేలు చేయాలనేదే తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ఎన్ని విమర్శలు చేసినా సలహా లాగే తీసుకున్నామన్నారు. సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నిర్ణయించామని అన్నారు. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ జరిగేలా ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. స్విట్జర్లాండ్‌కు చెందిన మల్టీవాక్ గ్రూప్‌తో ఒప్పందాలు చేసుకున్నామని వివరించారు. దావోస్ పర్యటనలో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని ఉద్ఘాటించారు. వన్ ట్రిలియన్ ఎకానమీ దిశగా అడుగుపడిందని చెప్పారు. మూసీ పునరుజ్జీవం, యువతకు ఉపాధిపై దృష్టిపెట్టామని తెలిపారు. మూసీని ప్రక్షాళన చేసి ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందిస్తామన్నారు. హైదరాబాద్ అంటేనే .. బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిందని చెప్పుకొచ్చారు. సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'గతేడాది దావోస్ సదస్సులో రూ.40వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు విశ్వసించారు. అందుకే 2024 దావోస్ పర్యటనకంటే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చేలా ప్రణాళిక రూపొందించాం అని అన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేలా స్కిల్ యూనివర్సిటీ ప్రణాళిక ఉంది. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అదిస్తాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి తదితరులు కూడా పాల్గొన్నారు.

# థియేటర్లకు హైకోర్టు షాక్

మొదటి పేజీ తరువాయి...

థియేటర్ సినిమాలకు మరో భారీ షాక్ ఇచ్చింది. ఇకపై థియేటర్స్‌లో పిల్లలు సినిమా చూడాలంటే నిర్దిష్ట సమయంలో మాత్రమే చూడాలనేలా తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తరువాత 16 ఏళ్లలోపు పిల్లలను సినిమాలకు అనుమతించరాదని థియేటర్లకు హైకోర్టు తెలిపింది. 'గేమ్ ఛేంజర్' మూవీ టిక్కెట్ ధరల పెంపును, అదనపు షోలకు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 4 పిటిషన్లపై విచారణ చేపట్టగా.. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు గత ఉత్తర్వుల మేరకు బెనిఫిట్ షోకు అనుమతిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పునః సమీక్షించి, ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతించరాదని నిర్ణయం తీసుకుంటూ జనవరి 11న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రజా ప్రయోజనాలు, ఆరోగ్యం, రక్షణలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకూడదనేలా నిర్ణయం తీసుకుందని తెలిపారు. అలాగే సినిమాటోగ్రఫీ నిబంధనల ప్రకారం ఉదయం 8.40లోపు, అర్ధరాత్రి 1.30 గంటల తర్వాత సినిమాలకు అనుమతించరాదని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనర్లను అనుమతించరాదని, లేని పక్షంలో అది వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో చివరి షో అర్ధరాత్రి 1.30 గంటల వరకు నడుస్తుందని, ఇందులో మైనర్ల ప్రవేశానికి ఎలాంటి నియంత్రణలు లేవని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, 'పుష్ప 2' బెనిఫిట్ షో సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మైనర్ బాలురు దుర్మరణం




రోడ్డు ప్రమాదంలో మరణించిన బాలురు





ప్రమాద స్తలంలో...



మరణించిన వారి బంధువులను ఓదారుస్తున్న బహదూర్ పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

బుద్వేల్ జనవరి28(ప్రభాత ఉదయం): సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో పాతబస్తీకి చెందిన ముగ్గురు మైనర్ బాలురు దుర్మరణం చెందారు. షబ్బే మెరాజ్ రోజు జరిగే జగ్ నే కా రాత్ సందర్భంగా ఇళ్లలో నుంచి యాక్టీవా ద్విచక్ర వాహనం తీసుకుని వారు ముగ్గురు బయటకు వచ్చారు. వీరి మరణానికి వేగంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతు జూపార్క్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు గల మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ పై విద్యుత్ స్థంభాన్ని ఢీ కొని, ఆ తర్వాత డివైడర్ ను ఢీ కొట్టడమే కారణమని తెలుస్తుంది. ఇద్దరు బాలురు అక్కడికక్కడే మరణించగా, ఒకరు అసుపత్రికి వెళుతుండగా మార్గ మధ్యలో తుది శ్వాస విడిచారు. పాతబస్తీ మొయిన్ పుర, తలాబ్ కట్ట ప్రాంతాలలో విషాదచాయలు అలుముకున్న ఈ సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రంజాన్ పండుగ కు నెల రోజుల ముందు వచ్చే షబ్బే మెరాజ్ ను ముస్లీం సోదరులు సోమవారం రాత్రి నిర్వహించుకున్నారు. షబ్బే మెరాజ్ సందర్భంగా రాత్రంత మేల్కొని ఉండి అల్లాకు ప్రార్థిస్తారు. అందులో బాగంగా సోమవారం రాత్రి 11:30 గంటలకు పాతబస్తీ తలాబ్ కట్ట జహంగీర్ నగర్ నివాసి బట్టల దుకాణంలో సేల్స్ మెన్ గా పనిచేసే సయ్యద్ రహీమ్ కుమారుడు సయ్యద్ ఇమ్రాన్ (16), పాతబస్తీ ఫతేదర్వాజ మొయిన్ పుర నివాసి స్థానికంగా వంట పనిచేస్తు జీవించే మహ్మద్ ఇలియాస్ కుమారుడు మహ్మద్ అహ్మద్ (14), అదే ప్రాంతానికి చెంది సౌదీ లో ఉద్యోగం చేసే సయ్యద్ షా మొహియుద్దీన్ ఖాద్రీ కుమారుడు తల్లి మునీరున్నీసా తో కలసి ఉంటున్న సయ్యద్ షా మహ్మద్ ఖాద్రీ అలియాస్ సయ్యద్ మాజ్ (14)లు బయటకు వెళుతున్నామని ఇంట్లో చెప్పి బయటకు వచ్చారు. వచ్చే సమయంలో తల్లి మునీరున్నీసా కు చెందిన యాక్టీవా ద్విచక్ర వాహనం టీఎస్ 12 ఈజెడ్ 9577 ను సయ్యద్ మాజ్ తీసుకుని బయటకు వచ్చాడు. అ ద్విచక్ర వాహనంపై ముగ్గురు స్నేహితులు తిరిగారు. రాత్రి ఒకటిన్నర గంటల సమయంలో వారు జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు నూతనంగా నిర్మించి ప్రారంభించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ పైకి వచ్చారు. ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడింగ్ చేస్తు వాహనాన్ని నడుపుతు ఆరాంగర్ వైపు వెళుతున్నారు. వారి వాహనం శివరాంపల్లి కి చేకుంటుంటుడగా ఫ్లై ఓవర్ పై ఉన్న సెంట్రల్ లైటింగ్ స్థంబానికి ఢీ కొంది. అ తర్వాత ఢీ వైడరు ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో సయ్యద్ అహ్మద్(14), సయ్యద్ మాజ్ (14) అక్కడిక్కడే దుర్మరణం చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న సయ్యద్ ఇమ్రాన్ (16) ను చికిత్స నిమిత్తం ఉస్మానియ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించారు. కుమారుడు మరణవార్త గురించి తెలుసుకున్న సౌదీ లో ఉండే సయ్యద్ షా మొహియుద్దీన్ ఖాద్రీ నగరానికి తిరిగి వచ్చి కుమారుని సమాది కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించిన బహదూరూర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

రోడ్డు ప్రమాదంలో బహదూర్ పుర కు చెందిన బాలురు మరణించారని తెలుసుకున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ రాత్రి ఒకటిన్న గంటల సమయంలో మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ పైకి వచ్చి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ టి.వెంకట్రామిరెడ్డిలతో పాటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియ మార్చురీకి తరలించి, తీవ్ర గాయాలతో ఉన్న సయ్యద్ ఇమ్రాన్ ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో సయ్యద్ ఇమ్రాన్ కూడా మరణించాడు. మృతుడు మహ్మద్ అహ్మద్ తండ్రి మహ్మద్ ఇలియాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మున్సిపల్ కమిషనర్లతో సమావేశమైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# ప్రజా సమస్యలపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, జనవరి 28(ప్రభాత ఉదయం) ప్రజా సమస్యలపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం దుబాయ్ పర్యటన ముగించుకొని వచ్చిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన నివాసం లో శంషాబాద్, మణికొండ, నార్సింగ్ బండ్లగూడ మున్సిపల్ కమిషనర్లతో సమావేశమయ్యారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నందున స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. తగు జాగ్రత్తలు తీసుకొని ప్రత్యేక అధికారితో సమన్వయంతో పనిచేయాలని, జటిలమైన ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని వారికి సూచించారు. ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు లేకుండా అందరికీ అందుబాటులో ఉండి సమన్వయంతో ఉండి పని చేసుకోవాలని ఆయన సూచించారు .ఈ సమావేశంలో బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర,నార్సింగ్ కృష్ణమోహన్ రెడ్డి, మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, శంషాబాద్ కమిషనర్ సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశమైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

# ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ పనిచేయాలి: ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, జనవరి28(ప్రభాత ఉదయం): ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నందున స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ తగు జాగ్రత్త లు తీసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ నియోజకవర్గం పరిధిలో ఉన్న మునిసి పాలిటీలు, కార్పోరేషన్ల కమిషనర్లకు సూచించారు. మంగళవారం మైలార్ దేవుపల్లిలోని తన నివాసంలో మునిసిపల్ కమిషనర్లు, కార్పోరేషన్ కమిషనర్లతో సమావేశమైనారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేకాధికారితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జటిలమైనన ఏదైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే పై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని వారికి సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తేకుండ అందరితో సమన్వయం గా ఉండి పనులు చేయాలన్నారు. ఈ సమావేశంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర , నార్సింగ్ మునిసిపల్ కమిషనర్ క్రిష్ణమోహన్ రెడ్డి , మణికొండ మునిసిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, శంషాబాద్ మునిసిపల్ కమిషనర్ సుమన్ రావు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, జనవరి 28(ప్రభాత ఉదయం) మైలార్ దేవుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. పల్లె చెరువు విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పల్లె చెరువు, తమిళ్ బస్తీ , ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సుభాన్ కాలనీ ఫేస్ వన్, మిలాన్ కాలని, అన్మోల్ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్తు వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



# పద్మశ్రీ మందకృష్ణ మాదిగను సన్మానించిన రాచమల్ల దాసు

శంషాబాద్, జనవరి 28( ప్రభాత ఉదయం) పద్మశ్రీ అవార్డు గ్రహీత మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను శంషాబాద్ మండల ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు శంషాబాద్ మాజీ ఉపసర్పంచ్ రాచమల్ల దాసు సన్మానించారు . సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్ లో జరుపు తలపెట్టిన లక్ష డప్పులు. వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహేశ్వరంలో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న మందకృష్ణ మాదిగను రాచమల్ల దాసు శాలువా పూలమాలతో సన్మానించారు. సుప్రీంకోర్టు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వర్గీకరణను అమలు చేయకపోవడం పట్ల రాచమల్ల దాసు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో మాలల ఆధిపత్యం ఉండడం కారణంగానే మాదిగలకు తీరని అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాటాన్ని ఒంటి చేతితో నడిపిన మందకృష్ణ మాదిగను ఆయన అభినందించారు. మాదిగ జాతిరత్నం మందకృష్ణ నాయకత్వంలో ఫిబ్రవరిలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రజక సంఘం నాయకుడు కోట్ల చంద్రకాంత్. బిజెపి నాయకుడు యూఎస్ నరసింహా. మున్నాభాయ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్ వద్ధ కనిపించిన రెండు తలల పాము. ఆ పాము ను పాద చారులు చెట్లలోకి కట్టెతో పోనిచ్చారు.

- ప్రభాత ఉదయం



మంగళవారం తెల్లవారు జామున రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 294 వద్ద నడుస్తున్న టీస్11 యూడీ 1548 నెంబరు లారీ కి నిప్పంటుకుని మంటలు ప్రారంభమైనాయి. గమనించిన లారీ డ్రైవర్ నీళ్లతో మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదమే తప్పింది.

- ప్రభాత ఉదయం




విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

# పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి

## డాక్టర్ మాధవి.. ధరూర్ మండల కేంద్రంలో గల హాస్టల్లో విద్యార్థులకు హెల్త్ క్యాంపు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి28(ప్రభాత ఉదయం) ధరూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహంలో మంగళవారం ధరూర్ వైద్యాధికారి డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వసతి గృహ విద్యార్థులకు డెటాల్ సోప్ లు పంపిణీ చేశారు. ఈ వైద్య శిభిరం లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ పై అవగాహన కల్పించారు.అనంతరం వారికి మందులను అందజేశామని డాక్టర్ మాధవి తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఆనందయ్య, ఎంఈఓ రవీంద్రబాబు ,హాస్టల్ వార్డెన్ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో సత్తా చాటిన

# అత్తాపూర్ శ్రీ చైతన్య విద్యార్థులు




బుద్వేల్, జనవరి28(ప్రభాత ఉదయం): క్యాట్ ఒలంపియాడ్ రెండో స్థాయి పరీక్షలో అత్తాపూర్ శ్రీ చైతన్య హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పుష్ప తెలిపారు. దేశవ్యాప్తం గా ఇటీవల నిర్వహించిన క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలలో అత్తాపూర్ శ్రీ చైతన్య హై స్కూల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఐదు నగదు బహుమతులు, పతకాలు, 12 సర్టిఫికేట్లు, 22 మెరిట్ సర్టిపికేట్లు వచ్చాయన్నారు. సత్తా చాటిన విద్యార్థులను డీన్ రాజేం దర్, వైస్ ప్రిన్సిపాల్, ఒలంపియాడ్ ఇంచార్జి శారద మాత, సి ఇంచార్జి నర్సింహ్మ లతో కలసి అభినందించడం జరిగిందని ప్రిన్సిపాల్ పుష్ప తెలిపారు.



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సంతోష్

# డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 28(ప్రభాత ఉదయం) డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు పరుమాల, గోనుపాడు గ్రామాలలో నిర్మిస్తున్న రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణం పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు ఇళ్లను త్వరగా అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రాథమిక వసతులైన నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లు, డ్రైనేజ్ వ్యవస్థ, సెప్టిక్ ట్యాంకులు, పరిసరాల శుభ్రత, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఇప్పటికే కొంత మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, మిగతా లబ్ధిదారులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయాలన్నారు. సమావేశానికి హాజరుకాని విద్యుత్ శాఖ, హౌసింగ్ శాఖల అధికారులకు షోకాస్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ రావు, ఇరిగేషన్ ఈఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ డి ఈ లక్ష్మణ్, విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీనివాస్, కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ని ఆహ్వానించిన గాజులరామారం,షాపూర్ నగర్ ఆర్యవైశ్య సంఘం

కుత్బుల్లాపూర్, జనవరి 28 (ప్రభాత ఉదయం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, షాపూర్ నగర్ లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మర్పన దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ని గాజులరామారం, షాపూర్ నగర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆహ్వానించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ వారి ఆహ్వానన్ని స్వీకరించి వైశ్యకుల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పవన్ కుమార్ గుప్తా, షాపూర్ నగర్ ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ వాస శ్రీనివాస్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ గుప్తా, శంకర్ గుప్తా, ప్రభాకర్ గుప్తా, జగదీష్, మూర్తి, సంతోష్, శేఖర్, ఉప్పలయ్య, హర్ష, ప్రియాంక, కవిత, గీత, మమత తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, జనవరి 28(ప్రభాత ఉదయం) అర్హులైన ప్రతి ఒక్కరికి కల్యాణ లక్ష్మీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్లవేళలా నిరుపేదలకు అందుబాటులో ఉంటుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన బాధితులకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000/-, రూ 46,000 ల సీఎం సహాయనిధి ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి మంజూరు చేయించారు. 127 డివిజన్ ఇందిర గాంధీ నగర్, బాచుపల్లి సాయి నగర్ చెందిన జన శిరోమణి 60 వేల రూపాయలు, ఉమ కి 47,500 రూ ముఖ్యమంత్రి సహాయనిధి-మంజూరి పత్రాలను (చెక్కులు) అందజేశారు. 127 డివిజన్ ఇందిర గాంధీ నగర్ మమత కి రూ. 1,00116/- ల కల్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు. అనంతరం హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెరికె శివ, తైలం శ్రీనివాస్, ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, శామీర్ పెట్ ప్రకాష్ రావు, ప్రశాంత్ రెడ్డి, గొంగుల నవీన్, అది రెడ్డి, లక్ష్మి రెడ్డి, మాధవి రాణి, నీల గుప్తా, చిన్నమ్మ, జానకి, ధనలక్ష్మి, కోమల, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి ఆర్ ఎస్ నాయకులు

## కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థాయికి మించిన ప్రకటనలు మానుకోండి

### జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ నేత నారామన్ అయ్యన్న

కొత్తకోట, జనవరి 28(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థాయికి మించిన ప్రకటనలు మానుకోవాలని జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ నేత నారామన్ అయ్యన్న హెచ్చరించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తకోటకు మీ ఎమ్మెల్యే ఒక తట్టేడు మట్టీ మోయలేదు..పైగా ఆలన్న సాధించిన నిధులకు..టెండర్ ప్రక్రియ అయిపోయిన..ఆ పనులకు అడ్డుకొన్న చరిత్ర మీది..మీ ఎమ్మెల్యేదని ఎద్దేవ చేశారు.



పేద విద్యార్థికి ల్యాప్ టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## పేద విద్యార్థులు బాగా చదువుకోవాలి: ఎమ్మెల్యే జి.ఎం.ఆర్

### బాగా చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం సంపూర్ణ తోడ్పాటు

కొత్తకోట, జనవరి 28(ప్రభాత ఉదయం) విద్యాభివృద్ధి తోనే సమాజాభివృద్ధి జరుగుతుందని అందుకోసం పేద పిల్లల తల్లిదండ్రులు విధిగా పిల్లలను చదివించి విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిపై ఉందని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. మంగళవారం కొత్తకోట మండలం మిరాస్ పల్లి గ్రామానికి చెందిన పసుపుల రాములు కుమార్తె పసుపుల పూజ కు ల్యాప్టాప్ అందజేశారు. విద్యార్థిని హైదరాబాద్ లోని సంతోష్ నగర్ లోని బోజిరెడ్డి ఇంజనీరింగ్ ఉమెన్స్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతూ... తనకు పై చదువుల నిమిత్తం ల్యాప్ టాప్ అవసరం ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ని కోరడంతో జిఎంఆర్ స్పందించి స్థానిక నాయకుల సమక్షంలో ఆ విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేసి, మంచిగా చదువుకుని మీ ఇంటికి, మీ ఊరికి మంచి పేరు తీసుకురావలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.

# పాత పెన్షన్ తక్షణమే అమలుచేయాలి



యూపీఎస్ ను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న జోగులాంబ గద్వాల జిల్లా టీఎస్ సిపిఎస్ ఇయు ప్రతినిధులు

### జోగులాంబ గద్వాల జిల్లా టీఎస్ సిపిఎస్ ఇయు కార్పొరేట్ల కోసమే యుపిఎస్ నో యూపిఎస్....నో సీపీయస్....ఓన్లీ ఓపియస్ అంటూ నినాదాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 28(ప్రభాత ఉదయం) పాత పెన్షన్ తక్షణమే అమలుచేయాలని జోగులాంబ గద్వాల జిల్లా టీఎస్ సిపిఎస్ ఇయు డిమాండ్ చేసింది. మంగళవారం ఇటీవల జనవరి 24న కేంద్ర ఆర్థిక శాఖ యూనిఫైడ్ పెన్షన్ విధానం ( యుపిఎస్) పై జారీచేసిన నోటిఫికేషన్ ను వ్యతిరేకిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల, కళాశాలల్లో తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యుపిఎస్) ప్రతులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం కృష్ణవేణి చౌక్ దగ్గర సాయంత్రం 6 గంటలకు వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో యుపిఎస్ ప్రతులను దగ్ధం చేస్తూ తీవ్ర నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ........ సిపీఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని గత దశాబ్ద కాలంగా తీవ్ర పోరాటం చేస్తుంటే ఇప్పుడు కేంద్ర ఆర్థిక శాఖ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి ఈ యుపిఎస్ విధానం తీసుకురావడం అప్రజాస్వామికమని ఇది కేవలం షేర్ మార్కెట్లోకి నిరంతరాయంగా పెట్టుబడులు పెట్టే విధంగా ఉందే తప్ప, ఈ విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబ- సామాజిక భద్రత కోణం లేదని తీవ్రంగా విమర్శించారు. ఈ విధానం వల్ల ఉద్యోగి తన సర్వీస్ కాలంలో జమ చేసిన ప్రతినెల బేసిక్ ప్లస్ డి ఏ లో 10 శాతం చొప్పున జమ చేసిన సొమ్మును ఎన్పీఎస్ ట్రస్ట్ కు బదిలీ చేసిన తర్వాతనే ఉద్యోగికి సర్వీస్ పెన్షన్ నిర్ణయించడం అనేది అత్యంత దారుణమైన చర్య అని దీన్ని సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ కూడా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్ లేకుండా పెన్షన్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని సుప్రీంకోర్టు నకారా కేసును గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిపిఎస్ యూనియన్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు నాగరాజు , జిల్లా గౌరవ అధ్యక్షులు బుచ్చన, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాగార్జున గౌడ్, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న , టిపీర్టియు జిల్లా అధ్యక్షులు తిమ్మప్ప, యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, టిఎస్పిటిఏ జిల్లా అధ్యక్షులు తిమ్మప్ప, సీపీయు యూనియన్ జిల్లా సహా అధ్యక్షులు సాతర్ల రఘు, వైస్ ప్రెసిడెంట్ ఎల్ల స్వామి, పాల్వాయి లక్ష్మి నారాయణ, జిల్లా కార్యదర్శి రాజేష్, పరుశ రాముడు, నాగరాజు, వీరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యం అవసరం

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ యం. ప్రియాంక



### జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ యం. ప్రియాంక

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 28(ప్రభాత ఉదయం) విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యం అవసరం అని, ఏదైనా పనిలో నైపుణ్యం పొందడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే స్వయం ఉపాధి పొందవచ్చని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ యం. ప్రియాంక పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం మంగళవారం గట్టు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో %౧% టిజిఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ బాలికల జూనియర్ కాలేజ్ (మానోపాడ్) లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్ కై కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాసెస్ నిర్వహించి, విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పదవతరగతి పాస్ అవ్వడానికి పాటించాల్సిన మెలకువలు వివరించారు. తదనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రతతో పాటు నాణ్యతతో కుడినా ఆహారం, విద్యను విద్యార్థులకు అందిచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలలో రోజువారీగా నిర్వహించే స్లిప్ టెస్ట్ నిర్వహణను జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ యం.ప్రియాంక, డిసిపిఓ అధికారి నర్సింహులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ చెన్నయ్య, ఎంఇఓ నల్లారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గుంటి గోపిలత, టిజిఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ ప్రిన్సిపాల్ కల్పన, డిసిపిఒ కౌన్సిలర్ సురేష్, డిహెచ్ఇడబ్ల్యూ జ్యోత్స్న, చిట్టెమ్మ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కొత్తకోట శ్రీ భవాని శంకర ఆలయ ప్రతినిధులు

గ్రామస్తులకు ఆహ్వాన పత్రికను అందజేసిన కొత్తకోట శ్రీశ్రీశ్రీ భవాని శంకర దేవాలయం కమిటీ ప్రతినిధులు



కొత్తకోట, జనవరి 28(ప్రభాత ఉదయం) కొత్తకోట మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ భవాని శంకర దేవాలయం శిఖర కలశం, ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ట ఆహ్వాన పత్రికను రామకృష్ణాపురం గ్రామస్తులకు భవాని శంకర దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణాపురం గ్రామస్తులు ఆహ్వాన పత్రిక అందుకుని తప్పకుండా మా గ్రామం తరపు నుంచి కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు తప్పకుండా భవాని శంకర దేవాలయం పూజా కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. ఈ పూజా కార్యక్రమాలు ఫిబ్రవరి 8వ తేదీ ( శనివారం రోజు) నుండి 10 తేదీ వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఆధ్యాత్మిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



## వైద్య చికిత్స కోసం ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

భూత్పూర్, జనవరి 28(ప్రభాత ఉదయం) దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలం మదిగట్ల గ్రామానికి చెందిన కుకుట్ల రవికుమార్ రెడ్డి కి వైద్య చికిత్స కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్ఓసిని ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి సీఎం సహాయ నిధి ద్వారా 1 లక్ష 70 వేల రూపాయల తో వైద్య చికిత్స చేయనున్నారు.



## అధ్యాపకులను నియమించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి28(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణంలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థలో గణితం, హిందీ బోధించే అధ్యాపకులు లేక విద్యార్థులు చదువులో వెనుకబడిపోయారని విద్యార్థినుల తల్లిదండ్రులు మంగళవారం కళాశాల ప్రధానోపాధ్యాయురాలుకు వినతి పత్రం అందజేశారు. గత మూడు నెలల నుండి రెండు సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించకపోవడంతో విద్యార్థులు గణితం, హిందీలో పట్టుకోల్పోతున్నారని ఇప్పటికైనా గణితం, హిందీ అధ్యాపకులను నియమించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు ఎండి రఫీ, బషీర్ అహ్మద్, చాంద్ పాషా, అక్బర్ భాష లు కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608